క్లుప్తంగా

అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీంద్రనాథ్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో రాబోయే మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలుపడంతో మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులతో ఎంపీడీఓ రవీంద్రనాథ్ బుధవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరు కూడా చేపలు పట్టేందుకు గోదావరి ప్రాంతంలోకి వెళ్లకూడదని, పశువుల కాపర్లు పశువులను వాగులను దాటించి మేతకు తీసుకొని పోకూడదని గ్రామంలో టాంటాం చేయించాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. తహసీల్దార్ రామారావు, ఎంపీఓ ప్రసాద్, ఎస్సై పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

కాళేశ్వరం: గ్రామాల్లో కొత్త వ్యక్తులు, అపరిచితులు కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని మహదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలు చేరాలన్నారు. ఎవరైన గంజాయి, డ్రగ్స్ సేవించిన, సరఫరా చేసిన తమకు తెలియజేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లకూడాదన్నారు. పశువుల యజమానులు వారి పశువులను ఇంటి వద్దనే కట్టేయాలన్నారు. పశువులు రోడ్లపై సంచారం చేస్తు ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయన్నారు. ఏదైన సమస్యలు ఉంటే నేరుగా పోలీసుస్టేషన్‌కు రావాలని పేర్కొన్నారు.

బొగ్గులవాగు ప్రాజెక్టు పరిశీలన



ప్రాజెక్టు వద్ద అధికారులు

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి అటవీ ప్రాంతంలోని బొగ్గులవాగు ప్రాజెక్టును ఇరిగేషన్ డీఈఈ సతీశ్ బుధవారం పరిశీలించారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షాల కారణంగా బొగ్గులవాగు చేరిన వరద నీటిని వారు పరిశీలించారు. ప్రాజెక్టులోకి 1890 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులో వచ్చినట్లు డీఈ తెలిపారు. మరో రెండు రోజులు ఎగువన కురిసిన వర్షాలతో ప్రాజెక్టు నిండుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద ఉన్న పొలాలు రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఈలు రాజేష్, రంజిత్‌సింగ్ ఉన్నారు.

దరఖాస్తు



తహసీల్దార్‌కు దరఖాస్తు ఇస్తున్న వెంకటేశ్వర్లు

చిట్యాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ బ్యాంకు అకౌంట్స్, జమ ఖర్చులు తదితర అంశాలను సమాచార హక్కు చట్టం -2005 ద్వారా ఇవ్వాలని తహసీల్దార్ షేక్ ఇమామ్‌బాబాకు బుధవారం ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడు చర్లపల్లి వెంకటేశ్వర్లు దరఖాస్తు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక అక్రమ రవాణా చేసిన క్రమంలో విధించిన పెనాల్టీ పూర్తి వివరాలను అందించాలని కోరినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, రాంరెడ్డి ఉన్నారు.

సన్మానం



రాజయ్యను సన్మానిస్తున్న నాయకులు

టేకుమట్ల: మండలంలోని కుందనపల్లి గ్రామానికి చెందిన రాజయ్య అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ కన్వీనర్‌గా ఇటీవల ఎన్నికయ్యాడు. దీంతో రాజయ్యను వివిధ సంఘాల నాయకులు బుధవారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య, సీపీఎం లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేష్, ఆకునూరి జగన్, పారనంది రాములు, మిట్టపల్లి చంద్రయ్య, బొల్లి నర్సయ్య ఘనంగా శాలువాలతో సన్మానించారు.

'రాజీవ్ యువవికాసం' అందేనా?

- ఆశగా దరఖాస్తుదారుల ఎదురుచూపు
- పథకం అమలుపై స్పష్టత కరువు

రేగొండ: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకాన్ని తీసుకువచ్చింది. అందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా పథకం అమలుపై స్పష్టత లేకుండా పోయింది. దీంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న నిరుద్యోగ యువత నిరాశకు గురవుతున్నారు.

అమలులో జాప్యం



రేగొండ మండల పరిషత్ కార్యాలయం

రాజీవ్ యువవికాసం పథకానికి రేగొండ మండలంలో 1972 కొత్తపల్లిగోరి మండలంలో 1198 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలుపుతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేశారు. ఈ పథకంలో రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతలో రూ.50 వేల నుంచి లక్ష వరకు దరఖాస్తులు చేసుకున్న వారికి రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అందిస్తారని తెలిపారు. కానీ అందించకపోవడంతో నిరుద్యోగులు నిరాశకు గురయ్యారు. మంత్రివర్గ సమావేశం అనంతరం అమలుపై నిర్ణయాలు తీసుకుంటారని ఇప్పటికే మూడు, నాలుగు సార్లు మంత్రివర్గ సమావేశాలు జరిగిన పథకం అమలుపై ప్రభుత్వం ఊసెత్తడం లేదు.

పారదర్శకంగా అందించాలి



రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఏలాంటి షరతులు లేకుండా రుణాలు అందించాలి. నిరుద్యోగులు రుణాల కోసం ఎదురుచూస్తున్నారు. కాలయాపన లేకుండా పారదర్శకంగా రుణాలను ఇవ్వాలి.

\- పెండెల రాజు, బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్

హామీని నిలబెట్టుకోవాలి



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు యువతకు రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి చేకూరుస్తామని హామీ ఇచ్చింది. నమ్మిన యువత ఓట్లు వేసి గెలిపించారు. అనంతరం యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి, జూన్‌లోనే లబ్ధిదారులకు రుణాలను ఇస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

\- దండెబోయిన సంతోష్, మాజీ సర్పంచ్, గాంధీనగర్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్సై సుధాకర్

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి శివారు మానేరు వరద ఉధృతి పెరిగిన సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సుధాకర్ అన్నారు. బుధవారం మానేరు వరద ఉధృతి పరిశీలించి ప్రయాణికులకు పలు సూచనలు చేశారు. ప్రయాణికులు మానేరు వాగు మార్గం కాకుండా వేరే మార్గాన్ని ఎంచుకోవాలని కోరారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది రాజు ఉన్నాడు.

పలిమెల: రానున్న మూడు రోజులు అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. మండలం గోదావరి తీర ప్రాంతం కావడంతో పశువుల కాపర్లు, రైతులు, జాలర్లు



టేకుమట్ల: మానేరు వాగు వద్ద ఎస్సై సుధాకర్

ఎవరూ కూడా గోదావరి తీర ప్రాంతానికి వెళ్లకూడదని తెలిపారు. భారీ లోతట్టు ప్రాంతాలు, వాగులు, కాల్వలు, దాటకూడదని సూచించారు. వర్షాలు, వరదల దృష్ట్యా ఏమైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని లేదా డయల్ 100 కాల్ చేయాలని సూచించారు.

18 నుంచి సర్వేయర్లకు శిక్షణ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో అర్హులైన సర్వేయర్లకు ఈ నెల 18వ తేదీ నుంచి రెండో విడుత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏడీ కుసుమకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. 18న ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ సెట్‌తో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో హాజరుకావాలని సూచించారు.

రైతులకు మెరుగైన సేవలు అందిస్తాం

- మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ తిరుమల

కాటారం: మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో కాటారం మార్కెట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్ది రైతులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తామని మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పంతకాని తిరుమల అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో బుధవారం ఛైర్‌పర్సన్ అధ్యక్షతన మొదటి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వైస్ ఛైర్మన్ బ్రహ్మారెడ్డి సూచన మేరకు పలు తీర్మానాలు చేయగా పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఏఎంసీ స్థలాన్ని అక్రమణ నుంచి స్వాధీనపర్చుకొని సరిహద్దు గోడ నిర్మించడం, రైతుల పశువుల కోసం ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు, మార్కెట్‌లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటుకు తీర్మానించారు. అలాగే కోల్డ్ స్టోరేజ్ గోడౌన్స్, ఫుడ్ ప్రాసెస్ యూనిట్స్ నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా నిధులు కోరడం, చెక్‌పోస్టులను బలోపేతం చేస్తూ నిరంతరం నిఘా పెంచి మార్కెట్ కమిటీ ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవడంతో పాటు పాలకవర్గానికి స్టడీ టూర్ ఏర్పాటు చేసి పాలన మెరుగుపర్చడం లాంటి అంశాలపై తీర్మానాలు చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఎరువుల గోదాంను ఛైర్‌పర్సన్, పాలకవర్గం సభ్యులు పరిశీలించారు. ఎరువుల పంపిణీ సక్రమంగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎంసీ కార్యదర్శి షరీఫ్, ఏడీఏ శ్రీపాల్, డైరెక్టర్లు తిరుపతిరావు, శ్రీనివాస్, రమేశ్, రామకృష్ణ, షరీఫ్, రాజారాం, రాజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సడువళి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ పంతకాని తిరుమల

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మొగుళ్లపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



చిట్యాల: విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, పోలీసులు

- ఎస్సై అశోక్

మొగుళ్లపల్లి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై అశోక్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, ఎన్‌సీసీ అధికారి రాజయ్య ఆధ్వర్యంలో బుధవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, ఇతరులను దూరంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో మత్తుపదార్థాల వినియోగం యువతను తప్పుదారి పట్టిస్తున్న ఒక తీవ్రమైన సమస్యగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యశ్రీ, కల్యాణి, అనిల్ కుమార్, కుమారస్వామి, ప్రవీణ్, రాజు, లలిత, పద్మ, విజయ భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కోడెపాక రఘుపతి మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని అందుకుగాను శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని కోరారు. మాదకద్రవ్యాలను కలిసికట్టుగా నిర్మూలించుకుందామన్నారు. అలాగే మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఏఎస్సై మధుసూదన్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరేయాలి



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

- బీజేపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి

మొగుళ్లపల్లి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మోరె వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగయాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతోమంది మహనీయులు ప్రాణత్యాగల ఫలితంగా స్వాతంత్య్రం వచ్చిందన్నారు. వారిని స్మరించుకోవడం, దేశభక్తిని పెంపొందించుకోవడానికి హర్ ఘర్ తిరంగయాత్ర నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారి శ్రీనివాస్, అరికాంతపు కృష్ణరెడ్డి, పులి వెంకట్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలను తీసుకెళ్తున్న భక్తులు

రేగొండ: కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో పోచమ్మ బోనాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలతో డప్పులు, వాయిద్యాల మధ్య ఆలయానికి వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. వర్షాలు బాగా కురిసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువులను రోడ్లపై వదిలితే చర్యలు

- ఎస్సై రమేశ్

పలిమెల: పశువులను ఇష్టానుసారంగా రోడ్లపై వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రమేశ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పలిమెల, పంకెన గ్రామాల్లో జీపీ సిబ్బందితో దండోరా వేయించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పశువుల యజమానులు ఇష్టం వచ్చినట్లుగా వదలడంతో రాత్రివేళల్లో అవి రోడ్లపై పడుకోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడడంతో పాటు భారీ వాహనాల రాకపోకలతో పశువులు కూడా మృతి చెంది నష్టం వాటిల్లే అవకాశం ఉందని వివరించారు. పశువులను రోడ్లపైకి రాకుండా జాగ్రత్త తీసుకోవాలని లేదంటే జీపీ, పోలీస్ సమన్వయంతో యజమానులకు జరిమానాలతో పాటు పశువులను గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.



దండోరా వేయిస్తున్న సిబ్బంది

జోరుగా ఇళ్ల నిర్మాణాలు

- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

వాజేడు: భద్రాచలం నియోజకవర్గంలోనే వాజేడు మండలంలో జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులు సాగుతున్నాయని, వాజేడు మండలంలోనే తొలిగృహ ప్రవేశం మంత్రి చేతుల మీదుగా చేయిస్తానని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ తెలిపారు. వాజేడు మండలానికి బుధవారం వచ్చిన ఆయన పేరూరు, చంద్రుపట్ల, టేకులగూడెం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను స్వయంగా పరిశీలించారు. పేరూరు బాలుర ఆశ్రమ పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నాగేశ్వరావుకు గుర్తుగా కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రారంభించి మాట్లాడారు. అదే విధంగా పిడుగు పాటుకు మృతి చెందిన అరికెల్ల వేణు కుటుంబాన్ని పరామర్శించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. పేరూరులో నిర్మాణాలు జరుపుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లపై నుంచి ఉన్న విద్యుత్ లైన్ మార్చాలని, బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరగా తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం మండలకేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల స్థితిగతులతో పాటు బిల్లుల చెల్లింపులపై గ్రామ పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 90 శాతం మేర ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పనులు కొన సాగుతున్నాయని తెలిపారు. సొసైటీ ఛైర్మన్ యగ్గడి అంజయ్య, విక్రాంత్ ఉన్నారు.

దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బీజేపీ

- ప్రజా సంఘాల నాయకుడు కిరణ్

కాటారం: ఎన్నికల్లో ఓట్లను తారుమారు చేసి అక్రమ దారిలో బీజేపీ గద్దెనెక్కిందని ప్రజా సంఘాల నాయకుడు పీక కిరణ్ ఆరోపించారు. మండల కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కిరణ్ మాట్లాడారు. బీజేపీ సార్వత్రిక ఎన్నికలను ఈవీఎంల ద్వారా నాశనం చేయడంతో పాటు దొంగ ఓట్లను నమోదు చేసి అక్రమ పద్ధతిలో గెలిచి రాజ్యమేలుతుందని అన్నారు. బీజేపీ ప్రభుత్వానికి దేశాన్ని పాలించే అర్హత లేదని వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. దొంగ ఓట్ల కుంభకోణాన్ని కళ్లకు కట్టినట్లు బట్టబయలు చేసిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి దేశంలోని ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి ఈవీఎంలు రద్దు చేసి బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని పోరాడటం మంచి పరిణామం అన్నారు. దొంగ ఓట్ల కుట్రలో భాగస్వామ్యమైన అధికారులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు అక్కల బాపు యాదవ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిరణ్

అభివృద్ధిని జీర్ణించుకోలేకనే ఆరోపణలు

- కాంగ్రెస్ నాయకుడు భూపెల్లి రాజు

కాటారం: మంథని నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేకనే మంత్రి శ్రీధర్‌బాబుపై బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు భూపెల్లి రాజు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజు మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా ఆనాడు మంథని అభివృద్ధి ఆ పార్టీ నాయకులకు గుర్తురాలేదన్నారు. అభివృద్ధి చేయాలనే ఆలోచన పక్కన పెట్టి కేవలం అక్రమ సంపాదనపై దృష్టి పెట్టిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీ నాయకులదని అని విమర్శించారు. రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి బీఆర్‌ఎస్ నాయకులు నిత్యం మంత్రి శ్రీధర్ బాబుపై అసత్య ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు

కాటారం: మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్‌లో బుధవారం ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణతో అలరించారు. అనంతరం ఉత్సాహంగా కేరింతల మధ్య ఉట్టికొట్టారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, ప్రిన్సిపాల్ కృషిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కాటారం: మండలంలోని దేవరాంపల్లికి చెందిన సంతోష్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేశ్, మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, నాయకులు నరివెద్ది శ్రీనివాస్, వంగల రాజేంద్రాచారి, జక్కు శ్రావణ్, ఉప్పు సంతోష్, అజిమిరా దేవా, గాజుల విక్రమ్, ప్రమోద్, మనోహర్, మురారి, సతీశ్, తదితరులు ఉన్నారు.

పలిమెల: మండల కేంద్రానికి చెందిన ఇందురి రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న కుమ్మరి లక్ష్మీనారాయణను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాటారం: పరామర్శిస్తున్న పుట్ట మధు

దోమల నివారణ మందు పిచికారీ

వాజేడు: మండల పరిధిలోని శ్రీరామ్ నగర్ ఎస్సీ కాలనీలో బుధవారం దోమల నివార్ణ మందును పిచికారీ చేశారు. పేరూరు వైద్యాధికారి రాహిల్ ఆధ్వర్యంలో ఈ దోమల నివారన మందును అన్ని ఇళ్లల్లో పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరీక్షించి మందులను ఇచ్చారు. గ్రామంలో ఆరుగురికి జ్వరం ఉన్నట్లుగా గుర్తించి వారి నుంచి రక్తనమూనాలను సేకరించారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూలి చెల్లించాలని ధర్నా

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో 18 పంచాయతీల కార్మికులు పనులు చేసి రెండు నెలలు కావస్తున్నా డబ్బులు చెల్లించలేదని అన్నారు. డబ్బులు తక్షణమే చెల్లించాలని.. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కట్ల నర్సింహచారి, కంతి వెంకయ్య, శ్రీను, నిర్మల, రజిత, తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు